

# కాంప్రమైజ్

వి. ఆర్. శశిధరుడు

**వర్షం** కురిసీ కురిసీ ఆగింది.

రావు కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగి ఆగాయి. చాలా దిగులుగా కనపడుతున్నాడు. అతను కాల్చి పారేసిన సిగరెట్ గోడ మూల వెలుగుతూ ఆరిపోయింది. ఇంకో సిగరెట్ వెలిగించాడు.

"మీ రెలాగైనా వాళ్ళను వెళ్ళకుండా ఆపాలి. జీవితంలో ఇప్పటికే చాలాసార్లు రోడ్డెక్కాము. ఈ దఫా అలా జరిగితే బ్రతకనేమో అనిపిస్తుంది."

ఇప్పటికి రెండుసార్లు అతని ఇంటి విషయాల్లో తలదూర్చి రాజీ చేసేటప్పటికి ప్రాణం పోయినంత పనైంది. అతను చేసేది చెడ్డ పనయినా అతన్నే ఎందుకు సమర్థిస్తానో ఎంత ఆలోచించినా కొరుకుడుపడదు.

రావు వారం తిరిగే లోపు చాలాసార్లు తాగుతాడు. కొడుకును తిడతాడు. పెళ్ళాన్ని కొట్టేనంత పని చేస్తాడు. కుక్కను డొక్కలో తంతాడు. అలా ఎందువల్ల ప్రవర్తిస్తాడో తనకే తెలియనట్లుగా కనపడతాడు. అతను చేసే పనులకు అర్థం లేదని కొట్టి పారేయటం సులువు కాదు. పనులు జీవితాలతో ముడిపడి ఉన్నాయి.

"నేను తాగుతానని గొడవ చేసి నన్ను హైరానా పెట్టేస్తారు. నేనేమన్నా రోడ్డు మీద పడి దొర్లుతున్నానా? ఆఫీసు ఎగ్గొట్టేసి పూరేసుతున్నానా? వాళ్ళకు కావల్సినవి సమకూరుస్తున్నానా, లేదా?"

రావు మనసు తెలుసుకోవటం ఆకాశానికి అంతం కనుక్కోవటమే. ఏనాడూ తన మనసులోని మాటల్ని స్పష్టంగా చెప్పడు. ఇంటి విషయం వదిలేస్తే, బయట ఏ ఒక్కరిని రావు కష్టపెట్టిన సంఘటనలుగానీ, బాధపెట్టిన విషయాలను నేనూ వినలేదు. స్నేహానికి ప్రాణం ఇస్తాడు. ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే పని గట్టుకొని వెళ్ళి గట్టున పడేస్తాడు.

మరి, అతని కుటుంబ వ్యవహారాలు అలా తయారవటానికి రావుదే కారణమా? అలా అయితే, స్నేహానికి ప్రాణమిచ్చేవాడు పెళ్ళాం బిడ్డలకు ప్రాణం ఎందు కివ్వడు?

"ఆఫ్టరాల్ కుక్క—దానికూడా లోకువయ్యాను. రోడ్డు మీద తిరిగే దాన్ని తీసుకొచ్చి సుఖంగా పెంచితే, వన్నే కేర్ చెయ్యదు. నన్ను చూస్తూనే తోక ముడుచుకుని మూలకు పోయి పడుకుంటది. దాన్ని డొక్కలో తన్నటం దానికి పాఠం నేర్పటమా? నా చేత కాని తనమా?"

రావు కుక్కను ఎందుకు పెంచుతున్నాడో తెలియదు. దాన్ని చూసినప్పుడల్లా నాకు చిరాకేస్తుంది. అసహ్యమేస్తుంది. పెంపుడు కుక్కలా కనపడదు. రోడ్డు మీద తిరిగే వూర కుక్కలా స్పష్టంగా కనపడుతుంది. అయినా చుట్టు ప్రక్కల పిల్లలకు ఆటబొమ్మలా ఉపయోగపడుతుంది. ఎంత హింస పెట్టినా వాళ్ళ మీద ఎదురు తిరిగిన సంఘటనలను చూడలేదు. కుయ్యో, మొర్రో అని ఏడుస్తూనే వాళ్ళ చుట్టూ తిరుగుతుంది. రాత్రిళ్ళు కొత్త అడుగు శబ్దాలు రోడ్డు మీద వినపడితే పిలేస్తుంది. ఏమైనా చూస్తూ చూస్తూ అసహ్యమేసే కుక్కను ఎవరు ఇంట్లో అట్టే పెట్టుకుంటారు? రావుకు ఆలోచన కలగటం దాని అదృష్టమేమో!

కిటికీ గుండా వర్షం జల్లు లోపల పడుతూంది. వర్షం చప్పుడు వినపడుతూంది. రావు గురించిన ఆలోచనలు రెక్కలు కట్టుకుని పక్షుల్లా ఎగిరిపోయాయి.

కిటికీ రెక్కలు మూస్తూ చూశాను. వర్షం కురుస్తూ ఎలక్ట్రిక్ దీపాల కాంతిని మింగేస్తూంది. చీకటి పెరిగిపోతూ ఉంది.

శంకరం కళ్ళలో మెదిలాడు.

శంకరం రావు కొడుకు.

• • •

శంకరం తడిసి ముద్దయి నుంచోనున్నాడు. అతని ముఖంలో అలసట కనపడుతూంది. జ్వరం పడి లేచినవాడిలా నీరసంగా ఉన్నాడు.

టవల్ ఇచ్చి, ఫ్లాస్కులోని కాఫీ ఇచ్చాను. తలొంచుకుని కాఫీ తాగేడు. చటుక్కున తలెత్తి నా వంక చూశాడు. అతని కళ్ళలో ఎర్ర జీరలు నిప్పు కణికల్లా కనపడుతున్నాయి. ఏడ్చిన గుర్తులు కళ్ళలో ఉన్నాయి.

"అయిదేళ్ళ క్రితం తెలియని అజ్ఞానంలో తప్పు చేసి ఇప్పుడు బాధ పడుతున్నాను. అమ్మతో వెళ్ళిపోయినా బాగుండేది. మళ్ళీ ఇప్పుడు అదే తప్పు చెయ్యటం న్యాయమంటారా?"

అయిదేళ్ళ క్రితం జరిగిన సంఘటనను శంకరం గుర్తుకు తెస్తున్నాడు.

రావు పెళ్ళాన్ని ఎందుకు వదిలేశాడో తెలియదు. కారణాలు చెప్పడు. మొగుడినీ, కొడుకునీ తలుచుకుంటూ పుట్టింట్లో చనిపోయిందని తర్వాత తెలిసింది. [illegible] కొడుకుని సినిమాకు పంపి, బ్లాక్ వైట్ సినిమా ముందుంచుకొని సరళను ఎలా ప్రేమలోకి దించిందీ వివరించి, పెళ్ళి చేసుకోబోతున్నట్లు చెప్పాడు.

రావు మనిషిలా కనిపించలేదు.

అదే అడిగాను. నా ప్రశ్నకు జవాబు సులువుగా చెప్పాడు.

"కొన్ని జీవితాలు అంతే, సార్. ఎందుకు పుట్టి పెరిగి రాలిపోతాయో ఆలోచించి బుర్ర బద్దలు కొట్టుకోవటం అవివేకం. గాలీ, నీళ్ళూ, నక్షత్రాలూ చావవేం?"

ప్రకృతే జవాబు చెప్పాలి. నేనేం చెప్పను?

సరళను చూసి షాక్ తిన్నాను. ఇరవై ఏళ్ళ అందం, మెరుపు ఆమెలో ఉంది. రావుకూ, ఆమెకూ ఇరవై ఏళ్ళ వ్యత్యాసం వాళ్ళ మధ్య ఉంది. ప్రైవేట్ ఫర్మ్‌లో చక్కటి ఉద్యోగం కూడా చేసుకొంటూంది. రావుతో తన జీవితాన్ని ముడి వేసుకుని, తన వయస్సు కొడుకును కళ్ళ ముందు చూసుకుంటూ సులువుగా రోజుల్ని గడపటం ఆమె కెలా సాధ్యమైందో?

"అమ్మ జీవితాన్ని తినేశాడు. సార్! ఇప్పుడు పిన్ని జీవితంతో ఆటలాడుకొంటున్నాడు. నా తండ్రిగా అతన్ని గుర్తుకు తెచ్చుకోవాలంటే సిగ్గుగా, అవమానంగా ఉంది. . ." శంకరం కంఠం వణుకుతూంది.

రావు శంకరాన్ని కళ్ళల్లో పెట్టుకొని పెంచాడు. తన మీద గురిని పెంచేసు కున్నాడు. అయినా శంకరం రావుతో బంధాల్ని తెంచుకోవాలని చూస్తున్నాడు. ఆలోచనలతో ఎంతగా సతమతమయ్యాడో బాధ పడ్డాడో అతన్ని చూస్తుంటే కనపడుతూంది. మనిషి మనుగడకు బంధాలు పెంచుకోటం అవసరమైతే, బంధాల్ని తెంచుకోవటంలోని అర్థం?

"నాన్నకు అమ్మ మీద అనుమానం. అనుమానం మనసులో పెంచేసుకుని భూతద్దంలో చూసుకున్నాడే తప్ప, రుజువుల కోసం చూశాడా? చంపేశాడు. ఇప్పుడు పిన్ని మీద అనుమానం. రాస్కెల్ అర్థమయ్యాడు, సార్ . . ."

రావు నాకూ అర్థమయ్యాడు. రావు పనులకు జవాబు దొరికింది. అనుమానాల వల్ల జీవితంలో తుఫాను తెచ్చుకొని పతనం చెందాడు. రాజీ కోసం వస్తాడు తప్ప, తన మనసులోని అర్థాన్ని ఎప్పుడన్నా చెప్పాడా? స్త్రీని నమ్మనివాడు—స్త్రీతో జీవితం సుఖంగా నడిచి పోతుందని ఎలా అనుకున్నాడు?

"మొన్న రాత్రి నాన్న మాటలు మితిమీరి పోయాయి. పిన్ని ఎలా భరాయించిందో మరి. ప్రియుడి పేరు చెప్పమని గొడవ చేశాడు. ఆమె కడుపులో ఉన్న ప్రాణి తనకేమీ కాదంటాడు. జుట్టు పట్టుకొని లాగేడు. అడ్డం పడితే నామీద విరుచుకు పడ్డాడు. అతను చేసే పనులు చెడ్డవని తెలిసి కూడా ఎంత కాలం అని అణిగి మణిగి ఉండడం? ఎదురు తిరిగాను. ఏం చెయ్యాలో తెలియక కోపం కుక్క మీద చూపించాడు!

సరళను అలా వూహించుకోవటం, వూహను అనుమానంగా మార్చుకొని నమ్మటం రావు గిల్టీ కాన్షన్. ఆమెను వెళ్ళగొట్టటం తన ఉద్దేశమైతే వెళ్ళ కుండా చూడమని నన్నెందుకు ప్రాధేయ పడ్డాడు?

"పిన్ని, నేనూ వెళ్ళిపోతున్నాం, సార్. ప్రతి క్షణం నరకంతో బ్రతికే పిన్నిని నాన్న నుండి కాపాడాలని నిశ్చ యించుకొన్నాను."

జీవితంలో మలుపులు ముఖ్యం. మోదం, లేదా విషాదం తేలిపోతుంది. శంకరం ఎదిగాడు. తల్లిని పోగొట్టు కున్నవాడు పిన్నికి రక్షణగా తయా రయాడు.

"నాన్న నన్ను ఉండిపొమ్మని బతిమాలాడు. పిన్నేమయిపోయినా పర్వాలేదు. అమ్మను పోగొట్టుకున్న వాడిని పిన్నిని కూడా పోగొట్టుకుంటానని ఎలా అనుకున్నాడో మరి! ఈసారి దగా పడకుండా వయస్సు తోడ్పడింది, సార్ తెలియని వయస్సులో అమ్మని పోగొట్టు కున్నాను. ఇప్పుడు పిన్నిని కంటికి రెప్పలా కాపాడుకుంటాను!"

రావు స్వార్థం స్పష్టంగా బయటపడి పోయింది. సరళ వెళ్ళిపోతే ఇంకో స్త్రీకి సులువుగా జీవితంలో చోటిచ్చి, అనుమానం వేస్తే వెళ్ళగొట్టవచ్చు. శంకరం అంటే తనకు ప్రాణం. శంకరం వెళ్ళిపోతే? ఇంకో శంకరాన్ని తెచ్చుకోటం సాధ్యం కాదని తెలుసు!

రావు స్నేహం తప్పు దోవలో నన్ను నడిపించాలని చూస్తోంది. రాజీ చేస్తే రుజువులు లేకుండా సరళను తప్పుడుగా అంచనా వేసినవాడు ఆమెను సుఖ పెడతాడనే గ్యారంటీ లేదు. సరళ కేమన్నా జరిగితే పరోక్షంగా నేనూ బాధ్యుణ్ణి అవుతాను!

శంకరం నా కళ్ళు తెరిపించాడు.

ఇప్పుడన్నా సరళ శంకరం అండతో మనశ్శాంతి అయినా పొందుతుంది.

రావు విషయం చూస్తూ ఉండాలే తప్ప, అతనిని మార్చడం నాకు ఎలా సాధ్యం?

● ● ●

వర్షం సన్నగా పడుతూంది.

రావు ఇంటి ముందు టాక్సీ ఆగి ఉంది.

చుట్టుప్రక్కల ఇళ్ళలోని మనుషులు కుతూహలంగా చూస్తున్నారని వాళ్ళను చూస్తుంటే అనిపిస్తోంది.

రెండు జీవితాలు గమ్యాన్ని వెతుక్కుంటూ ప్రయాణం చెయ్యబోతూ ఇంకో జీవితానికి మధ్య దూరాన్ని పెంచుకుంటున్నాయి.

మనుషుల్లోని క్యూరియాసిటీ చూస్తుంటే అసహ్యమేస్తోంది. జీవితంలో ఎత్తుపల్లాలు ఉంటాయనే నిజం తెలిస్తే, తమ చూపుల్లో అలాంటి భావాల్ని చూపించగలరా?

రావు కళ్ళు ఎర్రగా ఉన్నాయి. తల రేగిపోయి ఉంది. అతను పడే బాధ ముఖంలో కనబడుతూంది. చూసేవాళ్ళకు రావు మంచివాడులా కనిపిస్తున్నాడు. అతనువిడ్చేసిన ఏడుపులో శంకరం కోసం మాత్రమే దుఃఖం పరిమితమనే సత్యం నాకు తెలుసు.

మరి చుట్టూ ఉన్న మనుషుల సంగతి?

సరళ లేచిపోతున్నదానిలా కనిపి స్తోంది. భార్యా భర్తల్ని విడదీస్తున్న కర్కోటకుడిలా శంకరం కనిపిస్తున్నాడు. పెళ్ళాన్నీ, కొడుకునీ పోగొట్టుకోబోతున్న వాడిలా దిగులుగా రావు కనిపిస్తున్నాడు.

సరళ అన్నా, శంకరం అన్నా ఇష్టం నాలో ఏర్పడుతూంది. వాళ్ళ మీద జాలి నా మనసులో నిండుగా ఉంది. రావును చూడాలంటేనే అసహ్యంగా ఉంది.

రోలు, రోకలితో సహా సరళనూ, శంకరాన్నీ మోసుకుపోవడానికి టాక్సీ రెడీగా ఉంది.

శంకరం నా వంక చూశాడు. అతని కళ్ళలో ఆత్మవిశ్వాసం, పట్టుదల కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్నాయి.

నవ్వాను.

తనూ నవ్వాడు.

సరళ తలొంచుకుని కూర్చొని ఉంది. తన భవిష్యత్తుని ధైర్యంగా ఎదుర్కొనే ఆలోచనలు చేస్తోందని అనిపిస్తోంది

రావు కుక్క మీద నా దృష్టి పడింది.

టాక్సీని, రావును తరచి తరచి చూస్తోంది.

టాక్సీ బయలుదేరబోతూంది. టాక్సీ వైపు రెండడుగులు వేసింది. రావు చెయ్యి కుక్క మెడ మీద పడింది. గట్టిగా మొరిగి, తల విదిలించుకొని రావు చెయ్యిని కరిచి, వెళ్ళి టాక్సీలో దూకింది.

టాక్సీ వేగాన్ని అందుకొంది.

వర్షం నీళ్ళు రావు చేతి నుండి ఎర్రగా బొట్లుగా పడుతున్నాయి.

రావు నా వంక వాడిగా చూసి, గిరుక్కున వెనక్కు తిరిగి లోనికి వెళ్ళి తలుపు మూశాడు.

రావుకు నా స్నేహాన్ని పంచి పెట్టి, రావు కుక్కను అసహ్యించుకునేవాణ్ణి.

మరి ఇప్పుడు?

● ●

విన్నా, ఇవాళా ఎలా ఒక్కటి కాదో వచ్చే రేపు కూడా అంతే. గడి చేసిన ప్రతి రోజులోనూ మనుషుల్లో మార్పు, ఆలోచనలలో వ్యత్యాసం, బ్రతుకు మీద తీపి ఎలా వృద్ధి పొందుతాయో నా కళ్ళకు స్పష్టంగా కనిపించింది.

నా మనసులోని కొన్ని అభిప్రాయాలు పూసరవెల్లి రంగులా ఎలా మారిపోతాయో తెలిసిపోయింది.

మనసుల్ని మధ్య పెట్టుకొని, అసహ్యాన్ని, అయిష్టతను, క్రోధాన్ని గుండె అంచుల్లో భద్రపరుచుకొని కలిసి మెలిసి బ్రతకటం మనుషులకు ఎలా సాధ్యం అవుతుందో?

నేను ఎదురు చూడని రోజు వాడిగా, సూటిగా, వంకీ కత్తి అంచు మెరుపులా వచ్చింది.


● ● ●

సూర్యుడు తన ప్రతాపాన్ని చూపు తున్నాడు. ఎండ తారు రోడ్డు మీద మెరుస్తోంది. టాక్సీ రావు ఇంటి ముందు ఆగింది.

రోలు, రోకలితో సహా సరళ, శంకరం, రావు, కుక్క దిగారు. తెల్లటి మల్లెపువ్వులాంటి పంచె, లాల్చీతో ఇంకో మనిషి కూడా దిగాడు. భుజం మీద కండువా వేలాడుతూ అతని పెద్ద మనిషి తరహాను చాటి చెప్తోంది. కళ్ళు గర్వంగా మెరుస్తూ అతని ప్రయోజకత్వాన్ని,ఘనవిజయాన్ని, చుట్టూ ఉన్న మనుషుల మనసుల్ని ఆకట్టుకున్నాయి.

శంకరం కళ్ళు నేలను చూస్తున్నాయి.

రావు కళ్ళు, సరళ కళ్ళు కలుసు కున్నాయి. రావు చూపు శంకరం మీద నిలిచిపోయింది. అతని హృదయంలోని ఇష్టం, ప్రేమ కళ్ళలో వెలిగిపోతూ కనపడుతూంది.




రావు సాధించాడు.

కుక్క మొరుగుడు విని తల తిప్పి చూశాను. ఇంటి మనుషుల్ని, పరిసర ప్రాంతాన్ని చూస్తూ బిగ్గరగా మొరుగుతూంది. రావుని గుర్రుగా చూస్తోంది. మోహం మనుషుల్ని భయపెట్టేలా ఉంది. గంతులేస్తూ, చుట్టూ గిర్రున తిరుగు తూంది. తిరగడం ఆపి, మనుషుల్ని స్పష్టంగా మార్చి మార్చి చూసి, తప్పించుకొని రోడ్డు మీద పడి వూర కుక్కల్లో కలిసిపోయింది.

నాకు ఆశ్చర్యమేసింది.

రాజీకి వచ్చిన మనుషుల్ని చూసి చుట్టూ ఉన్న మనుషుల్లా ఆనంద పడక ఎందుకు పారిపోయినట్లు? సుఖంగా, తిండికిలోటులేకుండాచూస్తున్న మనుషుల్ని వదిలి రోడ్డు మీద ఎందుకు పడినట్లు?

నా మెదడుకు ఎంతగా పదును పెట్టినా సమాధానం దొరక్కుండా ఉంది.

రావు కుక్క తర్వాత నాకు కనిపించ లేదు. ★